సాక్షి
విశాఖపట్నం
శనివారం । 8 । ఏప్రిల్ । 2023



అప్పన్నకు శ్రీ పుష్పయాగం

సింహగిరిపై వారం రోజులుగా జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ముగిశాయి. 10లో



కేజీహెచ్‌లో సౌర వెలుగులు

కేజీహెచ్‌లో దశలవారీగా సోలార్ విద్యుత్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. 10లో



త్యాగధనుడు ఏసుక్రీస్తు

విశాఖ జిల్లాలో గుడ్‌ఫ్రైడే వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 10లో



న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు న్యాయమూర్తికి అందించారు.

చందనోత్సవ ఏర్పాట్ల పరిశీలన



దేవస్థానం గ్యారేజీలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏడీసీపీ అరీఫుల్లా

సింహాచలం: ఈనెల 23న జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవానికి సంబంధించి ట్రాఫిక్ నియంత్రణపై ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సింహాచలంలో పర్యటించారు. భక్తుల ద్విచక్రవాహనాలు, కార్లను సింహగిరిపైకి అనుమతించకపోవడంతో కొండదిగువనే వాటిని పార్క్ చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా ఆయా పార్కింగ్ ప్రదేశాలను నగర ట్రాఫిక్ ఏడీసీపీ అరీఫుల్లా, జోన్–2 ఇన్‌చార్జి ఏసీపీ భీమారావు, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ కె.అశోక్‌కుమార్, గోపాలపట్నం ఎస్ఐ కె.శ్రీనివాసరావు పలు ప్రాంతాల్లో పర్యటించారు. సింహాచలం దేవస్థానం ట్రాన్స్‌పోర్టు గ్యారేజీ, హవేలీ ప్రాంగణం, తొలిపావంచా వద్ద ప్రదేశాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏవిధమైన పనులు చేయాలో పరిశీలించారు. దేవస్థానం ఈఈ రాంబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు కూడా వందేభారత్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ (20833)వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఉదయం 5.45గంటలకు బయల్దేరవలసిన వందేభారత్ ఉదయం 8.15గంటలకు బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌నుంచి విశాఖ వస్తున్న వందేభారత్ రైలుపై ఖమ్మం – విజయవాడ మధ్యలో దుండగులు జరిపిన రాళ్ల దాడిలో సి–8 కోచ్ అద్దాలు దెబ్బతినడం, ఆ కోచ్‌కు సంబంధించిన అద్దాన్ని గురువారం మార్పుచేశారు. ఈ కారణంగా ఈ రైలు గురువారం నుంచి ఆలస్యంగా నడుస్తోంది.

సెలవుల్లో ఇంటర్ తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

బీచ్‌రోడ్డు: వేసవి సెలవుల్లో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపట్టడంతో పాటు ఆయా కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఆర్ఐవోలకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలిచ్చినట్లు సభ్యుడు గొండు సీతారాం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, వివిధ పోటీ పరీక్షల పేరిట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీలు చేపట్టి, తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే ఆర్ఐవోలతో పాటు కమిషన్ మెయిల్ apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

భవిష్యత్తుకు భరోసా.. మా నమ్మకం నువ్వే జగన్



35వ వార్డులో ఇంటికి అతికించిన స్టిక్కర్‌ను ఆసక్తిగా గమనిస్తున్న వృద్ధురాలు మంగ

సాక్షి, విశాఖపట్నం: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జిల్లాలో పెద్ద ఎత్తున ప్రారంభమైంది. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ప్రజలను కలిశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను తెలియజేశారు. వారి అభిప్రాయాలను సైతం అడిగి తెలుసుకున్నారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలు అడిగి ప్రజల అభిప్రాయాలను నమోదు చేశారు. ఇంటి యజమాని సెల్‌ఫోన్‌తో 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. ఇంటి యజమాని సమ్మతితో స్వయంగా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు.

- భీమిలి నియోజవర్గం మధురవాడలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే భీమిలిలో 3వ వార్డులో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పద్మనాభ మండలంలో మజ్జి గ్రామంలో ఎన్నికల పరిశీలకులు పసుపులేటి బాలరాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు.
- వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు జీవీఎంసీ 24వ వార్డు భూలోకమాత గుడి వద్ద పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో పాల్గొన్నారు.
- విశాఖ దక్షిణ నియోజకవర్గంలో పూర్ణామార్కెట్ జంక్షన్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజలతో మమేకమయ్యారు.
- పశ్చిమ నియోజకవర్గంలో 92వ వార్డులో ఇంద్రానగర్‌లో పార్టీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగనన్న గృహ సారథులు, కన్వీనర్ల ఉత్తరాంధ్ర కోర్డినేటర్ హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.
- విశాఖ తూర్పు నియోజకవర్గంలో సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో , 16వ వార్డులో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి,

- ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- ఐదు ప్రశ్నలతో పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ
- గత ప్రభుత్వానికి, ఇప్పటికీ తేడా వివరించిన నేతలు
- 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు.

- గాజువాక నియోజకవర్గంలో 64వ వార్డు పెదగంట్యాడ, వెంకన్నపాలెంలో ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా పలు వార్డుల్లో కార్పొరేటర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
- పెందుర్తి నియోజకవర్గం వేపగుంటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ప్రజల అనుమతితో ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించారు.



మధురవాడలో సెల్‌ఫోన్‌కు స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, మేయర్ హరివెంకటకుమారి



35వ వార్డులో గాయపడ్డ వృద్ధురాలు సత్యవతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



64వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



రేసపువానిపాలెంలో సంక్షేమ పథకాల పత్రం అందజేస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు



వేపగుంటలో సంక్షేమ ఫలాలను వివరిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

గుర్తింపు లేక ఆ'వేద'న!

- సింహాచలం వేద ఆగమ పాఠశాలలో ఇదీ పరిస్థితి
- ఈ పాఠశాల జారీ చేసే సర్టిఫికెట్లకు లభించని ప్రాధాన్యత
- వీటితో అర్చక ఉద్యోగాలకు అర్హత లేకుండా పోతున్న వైనం



సర్టిఫికెట్లతో ఇటీవల కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు




సింహాచలంలోని వేద ఆగమ పాఠశాల

సాక్షి, విశాఖపట్నం: తిరుపతి తర్వాత రాష్ట్రంలో సింహాచలం వేద ఆగమ పాఠశాలే పురాతనమైంది. ఎంతో విశిష్టత కలిగిన ఈ పాఠశాలకు చాలా ఏళ్లుగా 'గుర్తింపు' సమస్య వేధిస్తోంది. ఫలితంగా ఇక్కడ వేదాభ్యాసం చేసిన విద్యార్థులకిచ్చే సర్టిఫికెట్లు అక్కరకు రాకుండా పోతున్నాయన్న వేదన మిగులుతోంది. ప్రముఖ దేవస్థానం సింహాచలంలో ఏడు దశాబ్దాల కిందట 1954లో వేద ఆగమ పాఠశాల ఆవిర్భవించింది. అప్పట్నుంచి ఎందరో వేద పండితులను, ఘనాపాఠీలను తయారు చేసిన ఘన చరిత్ర ఈ పాఠశాలకు ఉంది. ఈ పాఠశాలలో వేదాన్ని అభ్యసించిన వారు రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ప్రధానాచార్యులుగాను, ఘనాపాఠీలుగాను వెలుగొందారు. కానీ చాలా ఏళ్ల నుంచి ఇక్కడ విద్యార్థులకిచ్చే సర్టిఫికెట్లకు ప్రాధాన్యత లేకుండా పోయింది. అంతకు ముందు వరకు ఈ సర్టిఫికెట్లకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. సుమారు 30 ఏళ్ల క్రితం దేవదాయ శాఖ అర్చక పరీక్షలు నిర్వహించడం మొదలు పెట్టినప్పట్నుంచి గుర్తింపు పొందిన వేద ఆగమ పాఠశాలల సర్టిఫికెట్లు పొందిన వారికే ఆ పోస్టుల్లో నియామకాలకు అనుమతిచ్చింది. సింహాచలం వేద ఆగమ పాఠశాలకు గుర్తింపు లేకపోవడంతో ఈ పాఠశాలలో అభ్యసించిన వారు దేవదాయ శాఖ అర్చక ఉద్యోగాలకు అర్హత పొందలేకపోతున్నారు. అంతేకాదు.. విదేశాల్లో అర్చకత్వం కోసం వెళ్లాలనుకున్న వారికీ ఈ సర్టిఫికెట్లు చెల్లుబాటు కావడం లేదు. దీంతో ఇలాంటి ఉద్యోగాల్లో చేరాలనుకున్న వారు, విదేశాలకు వెళ్లాలనుకున్న వారు ఈ పాఠశాలలో వేద ఆగమ శాస్త్రాలను అభ్యసించినప్పటికీ గుర్తింపు పొందిన మరో ప్రైవేటు వేద పాఠశాలలో మళ్లీ కోర్సును పూర్తి చేయాల్సి వస్తోంది. అలా ప్రైవేటు వేద పాఠశాలలో కోర్సు చేసి, సర్టిఫికెట్లను సమర్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది సింహాచలం వేద ఆగమ పాఠశాలలో అభ్యసించే విద్యార్థులకు ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. దీనిపై ఈ వేద పాఠశాలకు గుర్తింపునివ్వాలని కోరుతూ గత ప్రభుత్వాల హయాంలో ప్రిన్సిపాళ్లు, మరికొందరు దేవదాయశాఖ కమిషనర్లకు లేఖలు రాశారు. కానీ ఈ పాఠశాల గుర్తింపునకు నోచుకోలేదు. దీంతో ఈ వేద ఆగమ పాఠశాలలో అభ్యసించిన వారి సర్టిఫికెట్లు ఉద్యోగాలకు, విదేశాలకు వెళ్లేందుకు అక్కరకు రావడం లేదన్న భావనలో ఉంటున్నారు. ఫలితంగా ఈ వేద ఆగమ పాఠశాలకు బదులు ఇతర ప్రాంతాల్లో గుర్తింపు పొందిన వేద పాఠశాలలో చేరుతున్నారని, దీంతో ఈ పాఠశాలలో చేరే వారి సంఖ్య తగ్గిపోతోందని అంటున్నారు.

వేద కోర్సులివీ..

సింహాచలం వేద ఆగమ పాఠశాలలో పాంచరాత్ర ఆగమం (వైష్ణవ), శైవాగమం, స్మార్తం, రుగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద విభాగాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో వేదం 12, ఆగమం 8, స్మార్తం 5 ఏళ్ల చొప్పున కోర్సులు ఉంటాయి. రాష్ట్రంలోని దాదాపు 10 జిల్లాల నుంచి విద్యార్థులు ఇక్కడ వేద విద్య అభ్యాసానికి వస్తుంటారు. ఇతర ప్రైవేటు వేద పాఠశాలలకు ఇస్తున్న మాదిరిగానే సింహాచలం వేద ఆగమ పాఠశాలకు కూడా గుర్తింపు ఇవ్వాలని, దీంతో తమ పిల్లల భవిష్యత్తుకు ఆ సర్టిఫికెట్లు పనికొస్తాయని వేద విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

12 కరోనా కేసులు నమోదు



మహారాణిపేట: విశాఖలో శుక్రవారం 12 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనా వైరస్ ప్రభావం పూర్తిగా తగ్గిందనుకున్న సమయంలో శుక్రవారం నాడు 12 కేసులు వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. అందరు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 33కు చేరుకుంది. 28 కేసులు హోం ఐసోలేషన్ ఉండగా, ఐదుగురు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఆసరాతో మహిళాభ్యున్నతి



లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు తదితరులు

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): వైఎస్సార్ ఆసరాతోనే మహిళాభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఉత్తర నియోజకవర్గం పరిధిలోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగిన నాడే సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రహించారని, అందుకే మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలోని 3,223 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు సంబంధించిన 33,249 మంది సభ్యుల ఖాతాల్లోకి వైఎస్సార్ ఆసరా మూడో విడతలో భాగంగా సుమారు రూ.20.30కోట్లు జమ చేశామన్నారు. దేశ చరిత్రలోనే మహిళాభ్యుదయానికి విశేష కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి అని, ఆయనకు మీ అందరి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని, మహిళల సంక్షేమం, అభ్యున్నతికోసం అహర్నిశలు కృషి చేస్తున్న గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, విశాఖపట్నం–కాకినాడ పెట్రో కారిడార్ చైర్మన్ చొక్కాకుల లక్ష్మి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, మాజీ శాసనసభ్యులు తైనాల విజయకుమార్, బీసీ కార్పొరేషన్ సభ్యుడు పక్కి దివాకర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోకు, అల్లు శంకర్రావు, కార్పొరేటర్లు సారిపల్లి గోవింద్, అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, భర్కత్ అలీ, ముర్రు వాణి, రెయ్యి వెంకటరమణ, వావిలపల్లి ప్రసాద్, పార్టీ శ్రేణులు ఆళ్ల శివగణేష్, పేడాడ రమణికుమారి, వెంగళరావు, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, ఆర్పీలు, అధిక సంఖ్యలో ఆసరా గ్రూపుల సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ఉన్నంత వరకూ వైఎస్సార్ సీపీతోనే..



కొమ్మాది (భీమిలి): త్వరలో టీడీపీలోకి వెళ్లిపోతున్నానని, అనకాపల్లి నుంచి పోటీ చేస్తానని పలువురు దుష్ప్రచారం చేస్తున్నారని, నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు, నేను రాజకీయాల్లో ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీతోనే ఉంటానని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మధురవాడలో జరిగిన ఆసరా, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు మైండ్ గేమ్ ఆడుతూ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షనేతలకు పుట్టగతులుండవని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

అప్పన్న ఉంగరం చోరీ చేస్తారా?

- సింహగిరిపై పలువురు భక్తులను ప్రశ్నించిన అర్చకులు
- మేం ఉంగరం దొంగిలించలేదంటూ కన్నీటిపర్యంతం
- నవ్వుల సందడిగా సాగిన వినోదోత్సవం



విద్యార్థినులను ప్రశ్నిస్తున్న స్థానాచార్యులు



దొరికిన ఉంగరాన్ని చూపిస్తున్న పురోహిత్ అలంకారి సీతారామాచార్యులు

సింహాచలం: సింహాద్రి అప్పన్న స్వామివారి దర్శనానికి వచ్చి ఆయన ఉంగరాన్నే దొంగిలిస్తారా.? అదేం పని.. మర్యాదగా చోరీ చేసిన ఉంగరాన్ని ఇచ్చేయండి.. లేదంటే పోలీసులకు అప్పగిస్తాం.. అంటూ సింహగిరికి వచ్చిన పలువురు భక్తులను దేవస్థానం స్థానాచార్యులు ప్రశ్నించేసరికి అంతా కంగుతిన్నారు.

మేం దొంగల్లా కనిపిస్తున్నామా?.. స్వామివారి దర్శనానికి వస్తే ఉంగరాన్ని దొంగతనం చేశారంటారేంటి? పైగా తాళ్లతో బంధిస్తారా? అంటూ భక్తులు ఆవేశంతో స్థానాచార్యులను ఎదురు ప్రశ్నించారు.

చూడండీ.. మీరు దొంగతనం చేసినట్టు మా దగ్గర ఆధారాలున్నాయి. మీరు ఉంగరాన్ని తీసిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది. పోలీసులు రాకముందే ఉంగరాన్ని మర్యాదగా ఇచ్చేయండి.. అంటూ స్థానాచార్యులు మరింత గద్దించి అడగడంతో భక్తులు కన్నీటిపర్యంతమయ్యారు. చివరికి అప్పన్న వినోదోత్సవంలోని ఘట్టమని తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. తమకు మాత్రమే దక్కిన భాగ్యంగా భావించి ఆనంద భరితులయ్యారు.

ఈ నెల ఒకటో తేదీ నుంచి వారం రోజుల పాటు జరుగుతున్న స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గత గురువారం రాత్రి జరిగిన మృగయోత్సవంలో పోయిన స్వామివారి ఉంగరాన్ని వెతికే ఘట్టాన్ని శుక్రవారం ఉదయం వినోదోత్సవంగా నిర్వహించారు. ఏడు పరదాల్లో దాగున్న స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రాజగోపురం వద్ద పల్లకిలో అధిష్ఠింపజేశారు. స్వామివారి దూతగా పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కర్ర పట్టుకుని దర్శనానికి వచ్చిన పలువురు భక్తులను ఉంగరం దొంగిలించారంటూ తాళ్లతో బంధించి రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్ వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఉత్సవం గురించి తెలియని వాళ్లు కన్నీటిపర్యంతం కాగా.. తెలిసిన భక్తులు నవ్వుతూ సమాధానం చెప్పారు. స్వామిపై ఉన్న ఒక్కో పరదా తొలగించగా.. చివరి పరదాలో ఉంగరం దొరికింది. స్వామివారి దర్శనానికి వచ్చిన పలువురు విద్యార్థులతో పాటు దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, వంకాయల సాయినిర్మల, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ అప్పలనాయుడు, వంటశాల సిబ్బంది, అర్చకులు ఈ వేడుకలో భాగస్వాములయ్యారు.

పేపర్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఐఐఎం విశాఖపట్నం, ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్లు

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌పై అంతర్జాతీయ స్థాయి సదస్సు కోసం ఐఐటీ ఢిల్లీ, ఇండియన్ చాప్టర్ ఆఫ్ ది అసోసియేసన్ ఫర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్(ఐఎస్ఏఐఎస్) సహకారంతో ఐఐఎం విశాఖపట్నం శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీలో పేపర్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించింది. ఇందులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, డిజిటల్ హెల్త్‌కేర్, సైబర్ సెక్యూరిటీ మెటావర్స్, క్వాంటం కంప్యూటింగ్, సస్టైనబిలిటీ ఇలా సమకాలీన అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌కు చెందిన 59 ప్రముఖుల పత్రాలను సమర్పించారు. ఇందులో 11 రచయితల సమర్పనలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు నిపుణులు నిర్మాణాత్మక అభిప్రాయాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం విశాఖపట్నం డీన్ ప్రొఫెసర్ ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ విశాఖలో ఐఐఎం కొత్తగా ఏర్పాటైనప్పటికీ మేనేజ్‌మెంట్ విద్యకు సంబంధించి ప్రత్యేక గుర్తింపు సాధించడంలో సఫలీకృతమైనట్లు చెప్పారు. ఐఐటీ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ అర్పణ్‌కర్ మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధన పత్రాలను తయారు చేసేందుకు ఉత్తమ అభ్యాసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఏఐఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రియా సీతారామన్, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సాజీ మాథ్యూ, కార్యదర్శి ప్రొఫెసర్ సుజీత్‌శర్మ, ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖకు బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

సాక్షి, విశాఖపట్నం : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ మూడు రోజుల పాటు విశాఖలో పర్యటించనున్నారు. శనివారం మధ్యాహ్నం విశాఖపట్నం చేరుకోనున్న తోట ఎయిర్‌పోర్టు నుంచి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్ వరకూ పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లనున్నారు. అనంతరం అక్కడ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. 9వ తేదీ ఉదయం ఉత్తరాంధ్ర నాయకులతో భేటీ అయి పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నారు. అనంతరం రాజమండ్రి వెళతారు. అక్కడ వంగవీటి రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. తిరిగి విశాఖ చేరుకుంటారు. 10వ తేదీన ఆర్కే బీచ్‌నుంచి స్టీల్ ప్లాంట్ వరకూ ర్యాలీ నిర్వహించనున్నారు. స్టీల్ ప్లాంట్ మెయిన్ గేట్ వద్ద ఉక్కు ఉద్యోగులు, కార్మికులతో సమావేశంలో పాల్గొంటారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

కాటేసిన కనురెప్ప

- కన్నకూతురి పై అత్యాచారం
- గర్భవతిని చేసిన తండ్రి

పెదగంట్యాడ: కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రి కూతురిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించి 15 ఏళ్ల బాలికను గర్భవతిని చేశాడు. గంగవరంలో సంచలనం రేకెత్తించిన ఈ ఘటనకు సంబంధించి న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి (42) భార్య, ఇద్దరు కుమార్తెలతో గంగవరంలో నివాసం ఉంటున్నాడు. అతని పెద్ద కుమార్తె (15) 10వ తరగతి చదువుతోంది. కొద్ది నెలలుగా అతని కళ్లు ఆమెపై పడ్డాయి. ప్రతి రోజూ చిరుతిళ్లు తీసుకువచ్చి.. మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. ఈ నేపథ్యంలో బాలికకు కడుపునొప్పి రావడంతో ఆమె తల్లి శుక్రవారం ఆస్పత్రికి తీసుకెళ్లింది. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ బాలిక గర్భవతి అని చెప్పడంతో షాక్‌కు గురైంది. ఏం జరిగిందని కుమార్తెను ప్రశ్నించగా అసలు విషయం బయటకు వచ్చింది. తల్లి బాధను చూసి విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆగ్రహానికి లోనయ్యారు. అఘాయిత్యానికి పాల్పడ్డ తండ్రిని దేహశుద్ధి చేయబోయారు. ఇంతలో విషయం తెలుసుకున్న న్యూపోర్టు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

'అనధికారిక ఫుట్‌బాల్ టోర్నీలు తగదు'

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో అనధికారికంగా ఫుట్‌బాల్ టోర్నీలు నిర్వహించడం తగదని ఏపీ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జి.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ ఎఫ్ఏకు క్రీడాప్రాధికార సంస్థ గుర్తింపుతో ఉన్నది వీడీఎఫ్ఏ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సంఘం సభ్యులే ఇటీవల అంతర జిల్లాల టోర్నీలు నిర్వహించారన్నారు. అయితే అనధికారికంగా మరో మూడు సంఘాలు విశాఖలో టోర్నీలు నిర్వహిస్తుండడం అనైతికమన్నారు. అసలు జిల్లా సంఘంలో వేరే జిల్లాకు చెందిన వారు ఉండడం ఏమిటని ప్రశ్నించారు. ఎటువంటి అనుమతులు లేకుండా టోర్నీలు నిర్వహిస్తున్నారని, క్రీడాకారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

కేజీహెచ్‌లో సౌర వెలుగులు

- సీఎస్సార్ బ్లాక్‌లో రూ.80లక్షలతో 120 కె.వి.సోలార్ విద్యుత్ ప్లాంట్
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన యంత్రాంగం
- అనుమతుల కోసం డీఎంఈకు లేఖ
- దశలవారీగా అన్ని వార్డులకు విస్తరణ

మహారాణిపేట: కేజీహెచ్‌లో దశలవారీగా సోలార్ విద్యుత్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో 270 కె.వి.ద్వారా 32 వేల యూనిట్లు ఉత్పత్తి అవుతుండగా.. తాజాగా మరో 120 కె.వితో సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం అధికారులు చేసిన ప్రతిపాదనకు కలెక్టర్ ఎ.మల్లికార్జున గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్‌కు అవసరమైన రూ.80 లక్షల్లో సగం వాటాను సీఎస్సార్ నుంచి ఇవ్వడానికి కలెక్టర్ సూత్రప్రాయంగా అంగీకరించారు. మిగిలిన 50 శాతం నిధుల కోసం డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్(డీఎంఈ) అనుమతి కోరుతూ కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ లేఖ రాశారు. అనుమతి లభించిన వెంటనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి.. పనులు మొదలు పెట్టడానికి కేజీహెచ్ యంత్రాంగం సిద్ధంగా ఉంది.

కేజీహెచ్‌లో మొత్తం 1152 పడకలు, ఆపరేషన్లు థియేటర్లు ఉన్నాయి. ఇటీవల కార్డియాలజీ విభాగం, ఐసీయూ(ఏ,బీ విభాగాలు), పిల్లల వార్డులో ఏసీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో నెలకు 4,50,700 యూనిట్ల వరకు ఖర్చు అవుతోంది. ఇందుకోసం నెలకు రూ.43 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కేవలం విద్యుత్ సరఫరా కోసం ఖర్చు చేస్తున్నారు. వేసవిలో 5 లక్షల యూనిట్లకు చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ బిల్లులు తగ్గించుకునే క్రమంలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ వద్ద 200 కె.వి., ఆర్థోపెడిక్ విభాగం వద్ద 70 కె.వి.సామర్థ్యంతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 32 వేల యూనిట్లు ఉత్పత్తి అవుతోంది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా భవిష్యత్‌లో కేజీహెచ్‌లో నెలకు 8 లక్షల యూనిట్ల వరకు విద్యుత్ ఖర్చయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో దశల వారీగా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసు కోవాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా సీఎస్సార్ బ్లాక్ మొత్తానికి విద్యుత్ కల్పనకు సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

సీఎస్సార్ బ్లాక్‌ను 500 పడకలతో అత్యాధునికంగా నిర్మించారు. ప్రస్తుతం అయిదు అంతస్తుల్లో ఉండే ఈ భవనంలో 8 ఆపరేషన్ థియేటర్లు, నాలుగు ఐసీయూలు, ఒక ఐఆర్‌సీయూ ఉంది. ఇటీవల క్యాన్సర్ యూనిట్ కూడా ఇక్కడే ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఈ బ్లాక్ మొత్తం సోలార్ వెలుగులు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు సుమారు రూ.80లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. సీఎస్సార్ నిధుల నుంచి రూ.40 లక్షలు ఇవ్వడానికి కలెక్టర్ అంగీకరించారు. మరో రూ.40 లక్షలు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీసీ) నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించారు. రూ.40 లక్షలు ఇవ్వడానికి కేజీహెచ్ అధికారులకు అనుమతి లేకపోవడంతో డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్‌కు లేఖ రాశారు. కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నారు.


సీఎస్సార్ బ్లాక్

విద్యుత్‌కే అధిక ఖర్చు



కేజీహెచ్‌లో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఇందుకోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరాలో సమస్య వస్తే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక సిద్ధం చేశాం. ఇందుకు కలెక్టర్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎస్సార్ నుంచి రూ.40 లక్షలు కేటాయించారు. మిగిలిన నిధుల కోసం డైరెక్టర్ మెడికల్ హెల్త్‌కు లేఖ రాశాం. దశల వారీగా అన్ని బ్లాక్‌ల్లో సౌర విద్యుత్ కల్పిస్తాం.

– డాక్టర్ పి.అశోక్‌కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్

సౌర విద్యుత్‌తో ఆదా



కొన్ని సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. సౌర విద్యుత్ వల్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదు. పైగా నిధులు ఆదా అవుతాయి. అందుకోసం దశల వారీగా సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం సీఎస్సార్ బ్లాక్‌కు సౌర విద్యుత్ అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించి డీఎంఈకు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులకు శంకుస్థాపన చేస్తాం.

– సిహెచ్ శ్రీనివాస కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, కేజీహెచ్

అప్పన్నకు శ్రీ పుష్పయాగం

ముగిసిన వార్షిక కల్యాణోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై వారం రోజులుగా జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు శుక్రవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. కల్యాణోత్సవాల ముగింపు పురస్కరించుకుని సాయంత్రం నుంచి స్వామికి శ్రీ పుష్పయాగాన్ని విశేషంగా నిర్వహించారు. స్వామి కల్యాణ ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు విశేషంగా పూలతో అలంకరించి.. ఆలయ కల్యాణ మండపంలో ఆళ్వారులతో సహా అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. ద్వాదశి ఆరాధన, పలు రకాల పుష్పాలతో పుష్పాంజలి సేవ చేశారు. విశేషంగా హారతులిచ్చారు. అనంతరం భోగమండపంలో ఉంజల్‌సేవ చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు ఈ సేవలను నిర్వహించారు. దేవస్థానం ఈవో త్రినాథరావు, ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుడు ఏసుక్రీస్తు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



సెయింట్ పీటర్స్ వద్ద శిలువను ముద్దాడుతున్న విశాఖ ఆర్చిబిషప్ మల్లవరపు ప్రకాష్, రక్షణగిరికి పాదయాత్రగా వెళ్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: సర్వమానవాళి పాప విమోచన కోసం ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజే పవిత్ర శుక్రవారం(గుడ్ ఫ్రైడే) అని విశాఖ ఆర్చిబిషప్ రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాష్ అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం జ్ఞానాపురం పునీతపేతురు ప్రధాన దేవాలయంలో విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో రక్షణగిరి పరిసరాలు కిటకిటలాడాయి. క్రీస్తు త్యాగాన్ని కీర్తిస్తూ.. సర్వజన రక్షణ కోరుతూ కన్నీటితో ప్రార్థనలు చేశారు. శిలువ యాత్రకు జనం పోటెత్తారు. రక్షణ సభ గురువులు, పీపీసీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఫాదర్ మల్లవరపు ప్రకాష్, రెవరెండ్ ఫాదర్లు శిలువను మోసుకుంటూ వేలాది మంది భక్తులతో కలిసి రక్షణగిరిపైకి చేరుకున్నారు. క్రీస్తు మరణాన్ని సూచిస్తూ ఏర్పాటు చేసిన 14 విగ్రహాల వద్ద ప్రార్థిస్తూ ప్రదక్షిణలు చేశారు. విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ సందేశాన్ని అందించారు. సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయం వద్ద బైబిల్ పఠనం, దివ్యపూజ బలులు, సామూహిక ప్రార్థనలు జరిగాయి. సాయంత్రం 5 గంటలకు ఉపవాస దీక్షాపరులు రక్షణ గిరిపై దీక్షను విరమించారు. కార్యక్రమంలో పేరిస్ పాస్టిల్ కౌన్సిల్(పీపీసీ) సభ్యులు, వేల సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.


గురజాడ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

కిటకిటలాడిన గురజాడ కళాక్షేత్రం

బీచ్‌రోడ్డు: సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రం క్రైస్తవులతో నిండిపోయింది. శామ్యూల్ కర్మోజీ మినిస్ట్రీస్, మిరకల్ సెంటర్ చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన గుడ్ ఫ్రైడే ప్రార్థనలకు ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలల నుంచి వేలాది మంది క్రైస్తవులు తరలివచ్చారు. అంతర్జాతీయ ప్రసంగికుడు, మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బ్రదర్ శామ్యూల్ కర్మోజీ, సిస్టర్ సుస్మిత కర్మోజీలు క్రీస్తుప్రభు శిలువపై పలికిన ఏడు మాటలు వివరించారు.తొలుత సిస్టర్ శ్రేష్ఠ కర్మోజీ, జోయల్ సోహాస్ కర్మోజీ బృందం ఆలపించిన గుడ్ ఫ్రైడే భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

30 గంటల శిశువుకు గుండె శస్త్రచికిత్స

కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యుల ఘనత


శిశువు తల్లిదండ్రులతో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు

అక్కిరెడ్డిపాలెం: పుట్టిన 30 గంటల్లోపే శిశువుకు సంక్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు షీలానగర్ కిమ్స్ ఐకాన్ కడల్స్(తల్లీబిడ్డల) ఆస్పత్రి వైద్యులు. ఇది వైద్య రంగంలోనే అరుదైన శస్త్ర చికిత్స అని ప్రముఖ చిన్నపిల్లల గుండె శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ అనీల్ కుమార్ ధర్మపురం తెలిపారు. అనీల్ నేతృత్వంలో బృందం ఈ ఘనత సాధించిందని ఆస్పత్రి ఎండీ డాక్టర్ పెతకంశెట్టి సతీష్ కుమార్ వెల్లడించారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో శుక్రవారం వైద్యబృందం ఈ వివరాలు వెల్లడించింది. ఇదే ఆస్పత్రిలో విజయనగరానికి చెందిన దంపతులకు మార్చి ఒకటో తేదీన శిశువు జన్మించింది. పుట్టుకతోనే అబ్‌స్ట్రెక్ట్ టోటల్ ఎనామలస్ పల్మనరీ వీనస్ కనెక్షన్(టీఏపీవీసీ) అనే సమస్య ఏర్పడింది. శిశువుకు ఊపిరి అందక ఇబ్బంది పడుతుందని గుర్తించిన వైద్యులు.. ఆస్పత్రిలోని కడల్స్ ఎన్ఐసీయూలో చేర్చారు. డాక్టర్ నిఖిల్ తెన్నేటి నేతృత్వంలోని బృందం శిశువుకు గుండె సమస్య ఉందని అనుమానించింది. వెంటనే చిన్న పిల్లల గుండె వైద్య నిపుణురాలు శాంతి ప్రియ శిశువును పరీక్షించగా.. టీఏపీవీసీ అనే సంక్లిష్టమైన గుండె సమస్య ఉందని తెలుసుకున్నారు. శిశువు గుండె కుడివైపు కలిసే రక్తనాళాల్లో పెద్ద బ్లాక్ ఉందని గుర్తించారు. దీని వల్ల ఊపిరితిత్తుల నుంచి గుండెకు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరిగి పల్మనరీ హైపర్‌టెన్షన్ ఏర్పడిందని వైద్య బృందం తెలిపింది. సమస్యను పూర్తిగా గ్రహించిన వెంటనే టీఏపీవీసీని ఇంట్రా కార్డియాక్ రిపేర్ కోసం దాదాపు 8 గంటల పాటు శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ శస్త్ర చికిత్సలో గుండెకు కుడి వైపు వెళ్లిన రక్తనాళాలు తిరిగి ఎడమ వైపునకు మార్చి సాధారణ స్థితికి తీసుకొచ్చారు. కేవలం 30 గంటల వయసు మాత్రమే ఉండటంతో శిశువుకు గుండె కణజాతులు చాలా సున్నితంగా ఉంటాయని వైద్యులు తెలిపారు. అందువల్ల శస్త్రచికిత్స చేయడం సాంకేతికంగా చాలా సంక్లిష్టంగా మారిందన్నారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉందని, ఆహారం తీసుకుంటోందని చెప్పారు. అన్ని రకాల చికిత్స అందించిన తర్వాత శిశువును డిశ్చార్జ్ చేశామన్నారు. నెల రోజుల తర్వాత బిడ్డను మళ్లీ పరీక్షల నిమిత్తం శుక్రవారం ఆస్పత్రికి తీసుకొచ్చారు. తమ బిడ్డను కాపాడిన వైద్యులను అనీల్ కుమార్, సాయి బలరామ కృష్ణ, గోపాలరాజు, శాంతి ప్రియ, నాగరాజు, సాయి మణికంఠ, నిఖిల్‌లకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

కోరాపుట్-రాయగడ లైన్‌లో జీఎం తనిఖీలు


కోరాపుట్ స్టేషన్‌లో పర్యటిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం మనోజ్‌శర్మ

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం వాల్తేర్ డివిజన్ పరిధి కోరాపుట్-రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సెక్షన్ పరిధిలో రైల్వే కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, విండో ట్రైలింగ్ తనిఖీల ద్వారా మలుపులు, వంతెనలు, పాయింట్ అండ్ క్రాసింగ్స్‌లను పరిశీలించారు. కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. దమన్‌జోడి స్టేషన్ భవనంను పరిశీలించారు. లక్ష్మీపూర్ స్టేషన్‌లో పర్యటించి రైల్వే కాలనీ, హెల్త్ యూనిట్లలో పరిస్థితులను తెలుసుకున్నారు. రాయగడ స్టేషన్‌లో కొత్త స్టేషన్ భవనం, క్రూ లాబీ, పాదచారుల వంతెన, ప్లాట్‌ఫాం, ట్రాక్‌లకు సంబంధించిన పనులను పరిశీలించారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం, వాల్తేర్ డివిజన్లకు చెందిన పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కంబాలకొండలో సమ్మర్ క్యాంప్

ఐదు రోజుల పాటు చిన్నారులకు శిక్షణ


రాక్ క్లైంబింగ్

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో చిన్నారులకు సమ్మర్ క్యాంప్ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందిరాగాంధీ జూ పార్కు ఎదురుగా కొండల మధ్య ఉన్న ఈ పార్కులో లివిన్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో బోటింగ్, బర్మా బ్రిడ్జి, రాక్ క్లైంబింగ్ తదితర ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. వీటిలో ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వడానికి మే 1 నుంచి 5 వరకు అటవీశాఖ అనుమతితో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు లివిన్ అడ్వెంచర్స్ నిర్వాహకుడు బి.సత్యనారాయణ నాయుడు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు క్యాంప్ జరుగుతుందని.. ఐదేళ్లు దాటిన 50 మంది పిల్లలకు మాత్రమే ఈ క్యాంప్‌లో అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు రూ.1999 ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి అటవీశాఖ ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తామని, ఆసక్తి ఉన్న వారు 79890 45422లో సంప్రదించాలని కోరారు.

ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని వారి కోసం ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో ఈ నెల 10న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా-2003 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్-1 ఉపసంచాలకుడు ఆర్‌వీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ అన్ని ట్రేడుల అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ మేళాలో ప్రభుత్వ రంగ సంస్థ ఐఆర్ఈఎల్ (ఇండియా) లిమిటెడ్ వైజాగ్‌తో పాటు సుమారు 15కు పైగా ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు తమ సంస్థల్లో అవకాశం కల్పిస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెం పాత ఐటీఐలో సోమవారం ఉదయం 9 గంటలకు జరిగే మేళాకు నేరుగా హాజరుకావాలని కోరారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్-టాటానగర్ సెక్షన్ పరిధి ఖేమసులి స్టేషన్, అద్ర-చందిలి సెక్షన్ పరిధి కుస్తౌర్ స్టేషన్‌లో జరుగుతున్న ఆందోళనల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేశారు. ఈ మేరకు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె త్రిపాఠి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆందోళనల కారణంగా ఇప్పటివరకు సుమారు 244 రైళ్లు రద్దు చేసినట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీన విల్లుపురం-పురూలియా(22606), తాంబరం-జసిద్ది(12375), సాయినగర్ షిర్డీ-హౌరా(22893), హౌరా-జగదల్‌పూర్(18005), జగదల్‌పూర్-హౌరా(18006), అలప్పుజ-ధన్‌బాద్(13352) రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 7వ తేదీ(శుక్రవారం) పురులియాలో బయలుదేరాల్సిన పురులియా- విల్లుపురం(22605) ఎక్స్‌ప్రెస్ అద్ర నుంచి బయలుదేరింది.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,870
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,800
వెండి(కిలో):	రూ.80,200